ఏడుస్తున్నాడు. ముస్తకం అంటే పుస్తకం అన్నమాట. మా మూడోపిల్ల "పాము" అంటోంది. పాము అంటే చీమ అన్నమాట. పాము అంటే చీమ కాదా? తెల్లబోతారేఁ అది అంతేలెండి. పిల్లల భాష పిల్లల తల్లుల్నడిగి తెలుసుకోండి.

"సెమ్మా" అంటే తెలుసా సినిమా. "లేలి" అంటే చెప్పుకోండి చూద్దాం. తెలీదూ – రేడియో అన్నమాట, "తొండ" అంటే ఏవిటనుకున్నారు కొండ. ఇంకా ఇలా చాలానే వున్నాయి సాంకేతిక పదాలు, ఇవన్నీ మావారికి అర్థమయేలా ఒక శ్వేతపత్రం తయారు చేద్దామనుకుంటున్నా. (మా కమిటీలో పిల్లల తల్లులకే చోటు) పిల్లల మాటలన్నీ ప్రోగుచేసి వెన్నెలదండ గ్రుచ్చుతా. ఆ వెన్నెల దండ తీసికెళ్ళి చెప్పుకోండి ఎవరి మెళ్ళో వేస్తానో....

# వ్హాట్టు డూ?

ఫస్టు ఫారం ఫేలయిన టి.సీ. ప్రాథమిక హిందీ ప్యాసయినట్లు గాంధి గారి సంతకంతో సభవారిచ్చిన సర్టిఫికెట్టు, హార్మని పెట్టి, కొబ్బరికాయల మూట, చలివిడి, పసుపు–కుంకుమా, సున్నిపిండి – కుంకుడు కాయలు, నా కోసం ప్రత్యేకంగా కొన్న పెనుగొండ ట్రంకుపెట్టి, మెళ్లో ఒంటిపేట గొలుసు, నాన్తాడూ, మామిడి పిందెల నెక్లెస్, జడకుప్పెలు, నాగరం – ముక్కుపుడక, కాళ్లకు వెండి పట్టాలు, వెండి కంచం, కంచు మరచెంబు, చిన్న మనీపర్సు, అందులో పాతిక రూపాయలూ, సంసారానికి పనికివచ్చే పాత్ర సామగ్రితో చిన్న గోనెసంచీ వేసుకుని థర్డ్‌క్లాస్ లేడీస్ కంపార్టుమెంట్లోంచి నేను వాల్తేరు ప్లాటుఫారంమీద దిగడం నాకింకా గుర్తుంది.

కంట్లో కాటుక ముఖమంతా అలుముకునిపోయి వుంటుంది. కాళ్ళకు రాసిన పసుపు కొత్తచీర అంచులకు పట్టుకొంది. (మా అమ్మ కూడా వచ్చింది లెండి). అదుగోనే అతను అని ప్లాటుఫాం కూలీలను తప్పించుకుని మా వార్ని పోల్చి పట్టి నాకు చూపించింది. నేను కొంచెం మోడెస్టుగా నిలబడ్డా, సామాన్ల మధ్య నేనూ ఒక సామాన్లా – మా వారు అప్పటికింకా స్టూడెంటే. "వచ్చారా" అని అనేసి నన్నూ సామాన్నూ చూసి గాభరాపడ్డం మొదలెట్టారు. వాటీజ్ దిస్ అన్నట్లు చూశారు. పెళ్ళాం రావడమంటే మజాకా అనుకొంటున్నారేవిటి? దిసీజ్ ఆల్ అవర్ సంసారం అన్నట్లు కేర్‌లెస్‌గా చూశా – మా అమ్మను ఆ సామాన్నీ ఆప్లాట్ ఫాంమీద వదిలేసి నన్ను వక్కర్తిని చేయిపుచ్చుకు లేవదీసుకు పోదామని వచ్చినట్లుగా కనిపించింది. నన్ను ఎత్తుకుని ప్లాట్ ఫారంమీద పరుగెత్తమంటే అందుకు రెడీగా వున్నట్లున్నారు. కాని ఆయనకు ఈ సామానుతో బయట ఎలాపడాలో తెలీటం లేదు. పూర్ బోయ్ చాలా వ్రీడుగా కనిపించారు.

మా అమ్మ కూలీల్ను పిలవ్వోయ్ అంది. తలంబ్రాలు పొయ్యడం, బుక్కా జల్లుకోడం అనుకుంటున్నా రేవిటి పిలవండి అని కొంచెం చిలిపిగా చూశా. దాన్తో ఆయన పదిమందికూలీల్తో దెబ్బలాడేసి "వీళ్ళెవరూ రారు". వీళ్ళు దొంగరాస్కెల్సు ఐదిస్తావా పదిస్తావా అంటున్నారు. అని పళ్లు పటపట లాడించడం మొదలెట్టారు. అప్పుడు ట్రంకుపెట్టి ఆ వైపు పట్టుకోండి అన్నా అని ఒక వైపు కొక్కెం నేను పట్టుకుని భుజంమీద వూతంకోసం చేయి వేయగానే - తర్వాత సామానంతా ఆయనా నేనూ కలిసి హుషారుగా స్టేషన్లోంచి దాటించి బయటపారేశాం. మా అమ్మ కూడా పాపం సున్నిపిండి, కుంకుడుకాయలబుట్ట, మరచెంబు వగైరా వగైరా సాయం చేసిందనుకోండి. నేను రెండు సార్లు పడబోతే పట్టుకున్నారు. అది మాకు చిన్న గేం అనిపించింది. ఆ సరదాలో రైలునుకూడా మోసేసి బయట పారేసేవాళ్ళం. అప్పుడు ఆ పెట్టెమీద యిద్దరం ఒకర్నొకరం రాసుకుంటూ కూర్చుని చలిమిడి తిని సోడాలు తాగాం. వుయ్ హేవ్ సేవ్డ్ త్రీ టు ఫోర్ రుపీస్. మా అమ్మకు నా వరస అట్టే నచ్చలేదు. వుయ్ డోంట్ కేర్.

అప్పుడు నైన్ డవున్లో దిగని రాజకుమారుడు, దిగిన రాజకుమార్తెల చుట్టూ బళ్ళవాళ్లు మూగారు. మా అమ్మ రిక్షాలు కుదుర్చు నాయనా అంది. వుయ్‌డిడ్ వన్ సిల్లీ థింగ్. ఒక రిక్షానిండా సామాన్లు ఎక్కించి అందులో మా అమ్మను కూర్చోపెట్టాం. ఐ డోంట్ వాంట్ రిక్షా. ఐ వాంట్ పెట్టెబండి అన్నా. (అప్పుడు విశాఖపట్నంలో పెట్టె బండ్లున్నాయి) మేమిద్దరం ఎంచక్కా ఒక పెట్టెబండ్లో ఎదురెదురుగా కూర్చుని నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ జాలీగా తిరిగాం. మా అమ్మకు మేం కనపడం.... నా దగ్గర ట్వంటీఫయివ్ రుపీస్ వున్నాయని మా వారికి చూపించాను. అప్పుడాయన స్టూడెంటేగా - మా ఫాదర్ నాకింకా యంవో చేస్తారనికూడా నేను చెప్పాను.

నేను చెరిపించి చేయించుకున్న ఉంగరం మావారికి చిటికెన వేలుకు సరిగ్గా సరిపోయింది. ఆల్‌రైట్ టేకిట్ యువరానర్ అన్నా. నోనో అని మళ్ళీ నా వ్రేలికి తొడిగారు. మావారు మా అమ్మ చూడకుండా సిగరెట్టు నోట్లో పెట్టుకున్నారు. నేను అగ్గిపుల్ల గీశాను. నాబొడ్లో దోపుకున్న కారాకిల్లీ తీసి నేను బుగ్గన పెట్టా. మా వారు నా కొద్దు. నాకు కళ్లు తిరుగుతాయేమో అన్నారు. పెట్టెబండిచాలా స్లో - అందుకే ఐ లైకిట్. మేం ఆ వేళ ప్లాట్ ఫాంమీద చేసిన అల్లరి పెట్టెబండ్లో చేయలేదు. మేం ఆనెస్టుగా కూర్చున్నాం. అంతే! మంచి సెంటువాసన కొడ్తున్నావే అన్నారు. మొగలి సెంటు తెచ్చా నిమ్మనూనికూడా వుంది నా పెట్లో రాసుకుందురుగాని. నాకు పాకెట్ లేదుగా - ఎక్కడన్నా పడిపోతుంది. ఈ పర్సు మీ దగ్గరుంచండి. రుమాల్లో నా దగ్గర చిల్లరుంది అని ట్వంటీఫయివ్ రుపీస్ మావారికిచ్చా - ఆయన చాలా హేపీగా తీసుకుని బేక్ పాకెట్లో పెట్టుకున్నారు.

ఆ వేళ మా పెట్టిబండి గతుకుల్లోంచి సందుల్లోంచి పరిగెట్టింది. పచ్చని చెట్లని రాసుకుంటూ పరిగెట్టింది. ఆకాశం మా కోసం వంగి మమ్మల్ని పల్కరించి నవ్వింది. గాలివచ్చి మాకు చక్కిలిగింతలు పెట్టింది. చెంపల్ని రాసి ముంగురుల్ని దువ్వి "కుర్రాళ్లూ జాగర్త" అని వార్నింగు

యివ్వబోయింది. వుయ్ ఆర్ టూ - మైండ్ యువర్ ఓన్ బిజినెస్ అని చెప్పామనుకుంటా. యింటికెళ్ళాక మాకెంత గ్రాండ్ రిసెప్షన్ - మా అత్తయ్య, మావయ్యగారు, మరిదీ, మా వదినలూ వచ్చి నాకు దిష్టి తీసి నన్ను లోపలికి తీసుకెళ్ళారు. “ఆ కారాకిళ్ళీ వుమ్మెయ్” అని మా అమ్మ మూలకి తీసుకెళ్ళి నా బుగ్గమీద ఓ పోటు పొడిచింది.

అప్పుడు మా వారికో చిన్నగది వీధివైపునుండేది. ఈ గదిలో పుస్తకాల అలమార్లో నాకో అర ఖాళీచేసి యిచ్చారు మావారు. నా పెట్టెలోంచి తుక్కూ దూగర తీసి అందులో సర్దుకున్నాను. దాంట్లోంచి కొన్ని చీరెలూ, జాకెట్లూ తీసి మావారి సూట్‌కేసులో సర్దాను. ఆయన బట్టలు కొన్ని తెచ్చి నా పెట్లో పెట్టుకున్నాను. ఆ గది కిటికీ తలుపు తెరిస్తే ఎర్ర గన్నేరుకొమ్మలు లోపలికి త్రోసుకునివచ్చి వంగి పలకరించేవి. నేను వ్రాసిన ఉత్తరాలు తీసి నాకిచ్చి దాచుకోమన్నారు. అప్పుడాయనకు ఏదో పార్టు వుండిపోయింది పరీక్షలో - నేనా గదిలోకి వచ్చాక ఆ పార్టు అలానే వుండిపోతుందేమోనని ఇంటిల్లిపాదీ భయపడ్డారు. మొత్తానికి మా వారు ఆ పార్టు చెట్టెక్కించకుండా గట్టెక్కించి నా పరువు నిలబెట్టారు. లేకపోతే కోడలుపిల్ల వచ్చింది వాడి చదువు చెడగొట్టింది అని నా నేమ్ గోడలమీద కెక్కిపోతుందని నా భయం.

అప్పుడు నా స్టూడెంట్ మొగుడుగారికి ఓరోజు జ్వరం వచ్చింది. నన్నా గదిలోకి వెళ్ళనివ్వరు. నేను వెళ్తే జ్వరం తగ్గుతుందని నాకు తెల్సు - నన్ను మా అత్తయ్య ఆడబడుచుల మధ్య చాపేసి పడుకోబెట్టారు. “లోకమ్ముదైవమ్ముఏకమైపోయీ - మాకు ఎడబాటులైనా” అన్న లైలామజ్నూ అవస్థలో పడ్డాము. అప్పుడు నాకో ఐడియాతట్టింది. ఇ టీజ్ వేర్ ది బ్రైన్ వర్క్స్. మా నాన్న నాకు హోమియోపతి నేర్పాడు. నా దగ్గర కొన్నిసీసాలు మందులు పొట్లంకట్టి తెచ్చుకున్నా - ఐ నో సం మెడిసిన్. లేచి వెళ్ళి హాల్లో మూల దీపం వెలిగించి నా పెట్టె అంతా సర్దాను. మా మావయ్యగారు కాంప్ వెళ్ళారు. మా అత్తయ్య మేలుకునేవుంది. వాట్టుడూ - నాలుగు సీసాలు చేత్తోపట్టుకుని మళ్ళీ అత్తయ్య దగ్గరకెళ్ళి తట్టిలేపి “అత్తయ్యా తనకి ఈ మాత్రలు యిస్తే జ్వరం తగ్గుతుంది. మా నాన్న యిచ్చాడు. నాకు హోమియోపతి తెల్సు” అన్నా. “పద మా తల్లే” అని నన్ను వెంటబెట్టుకుని మా అత్తయ్య గదిలోకి తీసుకెళ్ళింది. నేను డాక్టర్‌గానని మా స్టూడెంట్‌కి తెలియదు. పల్సు చూశాను. నాలుక చాపమన్నాను. అంతా సిస్టమేటిక్‌గా పేషంటుని నిజం డాక్టర్లా పరీక్ష చేస్తూంటే మా అత్తగారు ఆశ్చర్యపోయింది. పొట్లాలు కట్టిన పంచదార మాత్రలు గంటగంటకీ యివ్వండత్తయ్యా అని సీసా ఆమెకిచ్చాను. బాగుందేవ్ పిల్లా నాకెక్కడ కుదుర్తుంది. నీ మొగుడికి నువ్వే వేసుకో యిక్కడ కూర్చుని గంటగంటకి అని ఆవిడ వెళ్ళిపోయింది. ఎలాంటి దంపతులకైనా కష్టాలొస్తాయి. ఆపద్ధర్మంగా ఒకటో అరోజిత్తులు తెలియకపోతే పెద్దవాళ్ళ మధ్య పిల్లసరుకు ముచ్చట్లు తీరడమెలా? అప్పుడు నన్ను మావారు డాక్టర్ అని పిలిచారు. ఇప్పుడు నాకు పద్మశ్రీ యిచ్చినా ఐ డోంట్ కేర్. కాని ఆనాటి రోజులిక రావిక రావిక రావు. నెచ్చెలీ అని అనిపిస్తోంటే వాట్టుడూ?